త్యాగానికి ప్రతీక బక్రీద్..

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ..

కేపీహెచ్‌బీ కాలనీ/మూసాపేట, జూన్ 17 : త్యాగనిరతికి.. ధర్మనిబద్ధతకు ప్రతీకయైన బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ, మూసాపేట, హబీబ్‌నగర్, కూకట్‌పల్లిల లోని ఈద్గాలు, మసీదులలో బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు ప్రాంతాల్లో బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్‌రావు, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ఏసీసీ శ్రీనివాస్‌రావు, సీఐలు, ఎస్సైలు పర్యటించి, శాంతి భద్రతలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు చున్ను పాషా, ఎండీ మోయిజ్, ఎస్‌కె.సత్తార్, షేక్ మస్తాన్ , తదితరులు ఉన్నారు.

● కొండాపూర్ : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం కొండాపూర్ డివిజన్, మార్తండనగర్‌లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనం తరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● మియాపూర్ : వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్‌లలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ , డివిజన్ కాంగ్రెస్ యువజన నాయకుడు రామకృష్ణ గౌడ్ , తదితరులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

కుత్బుల్లాపూర్ పరిధిలో.

దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంటసర్కిళ్లతోపాటు నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల పరిధిలోని ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అదే విధంగా పలువురు ముస్లిం సోదరులు ఎమ్మెల్యే వివేకానం ద్‌ను కలువగా.. ఆయన వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

● మాదాపూర్ : మాదాపూర్ డివిజన్, హఫీజ్‌పేట్ ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్, కృష్ణ, వీరేందర్, మహిపాల్ యాదవ్, సాంబశివరావు, శేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకురాలు సౌందర్య రాజన్, పోచయ్య, నితిన్, లక్ష్మణ్, మునఫ్ ఖాన్, హమీద్, రహీం, హనీఫ్, ఖాజా, ముషారఫ్, తదితరులు ఉన్నారు.

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్


కేపీహెచ్‌బీ కాలనీ ఈద్గాలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం సోదరులు

మూసాపేట పరిధిలోని జామా మసీదు వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాసరావు, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాసరావు

కొండాపూర్ డివిజన్, మార్తండనగర్‌లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు

హఫీజ్‌పేట్ ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో..

వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్‌లో..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఈద్గాలో..

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

జగద్గిరిగుట్ట, జూన్17 : జగద్గిరిగుట్ట డివిజన్, రాజీవ్‌గృహకల్పలోని సంస్కృతిస్కూల్ పక్కన ఉన్న ప్రభుత్వస్థలాన్ని కొంతమంది కబ్జాకు పాల్పడ్డారు. గతంలో ఫిర్యాదులు రాగా అధికారులు వాటిని కూల్చివేశారు. అయితే కొందరు గదులు నిర్మించుకోగా.. మరికొందరు పాన్ డబ్బాల ముసుగులో ఆక్రమణకు యత్నిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడుతామని డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పున్నారెడ్డి అన్నారు.

నేటి నుంచి రాజకీయ శిక్షణ తరగతులు

హిమాయత్‌నగర్, జూన్ 17: నేటి నుంచి 20 వరకు యాదగిరిగుట్టలోని లక్ష్మీ నరసింహ స్వామి ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ తెలిపారు. తరతరాలుగా అణిచివేత, అంటరానితనం, వివక్షత, దోపిడీ, పీడన కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, ప్రొఫెసర్ ఖాసీం తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. దళితులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సహాయక చర్యలు..

జూబ్లీహిల్స్, జూన్ 17: యూసుఫ్‌గూడలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. కాల్వలు, డ్రైన్లలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా మ్యాన్‌హోల్స్ వద్ద మాన్‌సూన్ బృందాలు పనులు చేపట్టారు. ఈఈ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు, అధికారులతో కలిసి సహాయక పనులు పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం ..

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు

దుండిగల్, జూన్17: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు అన్నారు. శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్సీని కలిశారు. ఈ సందర్భంగా తమ, తమ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తాము ఎల్లప్పుడు పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ విజేత శశాంక్

టోర్నీ విజేతలను అభినందిస్తున్న ఇండియా చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, తదితరులు

నేరేడ్‌మెట్, జూన్ 17: యోనెక్స్ సన్‌రైస్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో శశాంక్, దుర్గా ఇషా, కీర్తి మంచాలలు విజేతలుగా నిలిచారు. మియాపూర్‌లోని చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా జరిగిన ఈ టోర్నీ సోమవారం ముగిసింది. అండర్ -15 సింగిల్స్ ఫైనల్లో హైదరాబాద్ కొటక్ పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన శశాంక్ అదే అకామీకి చెందిన గిరవాసన్‌పై 21-11, 22-20తో గెలిచి టైటిల్ సాధించాడు. అండర్ -17 గర్ల్స్ డబుల్స్‌లో దుర్గా ఇషా-కీర్తి మంచాల, దీపక్ రాజ్ అధితి- పొన్నమ్మ బీవీ వృద్ధిలపై 21-16, 21-19తో గెలిచారు. అండర్- 15 రన్నర్స్ ప్రాంజల్ ప్రశాంత్ శిండే, గాత సూర్యవంశీలు రన్నర్స్‌గా విజయాలు సాధించారు. క్రీడాకారులందరూ పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ టైటిల్ విజేతలకు ఇండియా చీఫ్ కోచ్ పుల్లెల గోపిచంద్, అకాడమీ సీనియర్ కోచ్ రాజేందర్, అనిల్, బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు యూవీఎన్ బాబు, కుమార్‌లు అభినందించారు.

పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు

హిమాయత్‌నగర్, జూన్ 17: బక్రీద్ పండుగ నేపథ్యంలో హిమాయత్‌నగర్ డివిజన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను సోమవారం పారిశుధ్య కార్మికులు తొలగించారు. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, అంబర్‌పేట సర్కిల్-16 ఏఎంహెచ్‌వో హేమలత పర్యవేక్షణలో కింగ్‌కోఠి, రాంకోఠి, షేర్‌ఘాట్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో యుద్ధ ప్రాతిపదికన తొలగింపజేశారు.

రక్తదాన శిబిరం..

రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్, జూన్ 17: మల్కాజిగిరి శాసన సభ్యులు, ఎంఎల్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపక కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక అరుంధతి వైద్యశాలలో రక్తదానం శిబిరం నిర్వహించగా సుమారు 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్ రావు, అరుంధతి వైద్యశాల డీన్ డా.కె.ఉదయ్‌కుమార్,బాలాజీ, తదితరులు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నా రు. అంతకుముందు ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో చిన్నారులకు ఆహారప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయరంజన్‌గౌడ్, వాలంటీర్లు ప్రశాంత్, ఆర్యన్, నరేశ్, లిఖిత, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి..

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న యూజీడీ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూజీడీ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులను సైతం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, వాసు దేవరావు, శామ్యూల్, ప్రసాద్ పాల్గొన్నారు.

– మియాపూర్ , జూన్ 17

ఎయిర్‌పోర్టు గోయల్ డ్రైవర్లను పర్మినెంట్ చేయాలి

శంషాబాద్ రూరల్, జూన్ 17: ఎయిర్‌పోర్టులో గోయల్ సంస్థలో పని చేసే డ్రైవర్లను పర్మినెంట్ చేయాలని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు డ్రైవర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..2008 నుంచి గోయల్ సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లను 8 ఏండ్లలో పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఉద్యోగంలోకి తీసుకున్నారని తెలిపారు. సంస్థ 16 ఏండ్లు దాటినా ఇప్పటికీ పర్మినెంట్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం డ్రైవర్లను పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎయిర్‌పోర్టులో డ్రైవర్లుగా పనిచేస్తున్న తాము సంస్థ ప్రతినిధులను వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లితే సెక్యూరిటీ ప్రతినిధి వినతిపత్రం తీసుకున్నట్లు తెలిపారు. తమకు న్యాయం చేసే వరకు ఊరుకునేదిలేదని హెచ్చరించారు. త్వరలో కార్యచరణ ప్రకటించి, గోయల్ సంస్థ తమను పర్మినెంట్ చేసేవరకు ఉద్యమిస్తామన్నారు.

తెలంగాణలో హిందూ వ్యతిరేక పాలన

సుల్తాన్‌బజార్, జూన్ 17 : తెలంగాణలో హిందూ వ్యతిరేక పాలన కొనసాగుతుందని, బక్రీద్ సందర్భంగా వేల సంఖ్యలో గోవులను వధిస్తున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. మూడు రోజులైనా మెదక్‌లో హిందువులపై కత్తిపోట్లు, దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇదే విషయంలో హిందువులను మాత్రమే రిమాండ్ చేయగా న్యాయమూర్తి సైతం ఒకే వర్గాన్ని ఏ విధంగా రిమాండ్ చేస్తారని అవతలి వర్గాన్ని కూడా రిమాండ్ చేయాలని సూచించినా పోలీసుల తీరు మారడం లేదన్నారు. దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేయడంలో ఐజీ రంగనాథ్, ఎస్‌పీ బాలస్వామి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. మలక్‌పేటవద్ద గోవులను కాపాడిన యువతుల నుచంపేస్తామని బెదిరించినవారిపై కూడా కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

జమాల్ (ఫైల్)

నేరేడ్‌మెట్, జూన్ 17: వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ కథనం ప్రకా రం.. ఓల్డ్ సఫిల్‌గూడ లక్ష్మీనగర్‌లో జమాల్(92) నివాసం ఉంటుంది. అయితే సోమవారం ఉదయం ఇంటినుంచి బయటికు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు నేరేడ్‌మెట్ పోలీసులకు ఫి ర్యాదు చేశారు. పోలీసులు కేసు న మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్‌లో యువకుడు..

శివాన్ను(ఫైల్)

మేడ్చల్, జూన్ 17 : యువకుడు అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సంగం కుమార్ చౌబీ మేడ్చల్‌లో నివాసం ఉంటూ రవాణా వ్యా పారం చేస్తున్నాడు. ఆయన భార్యతో కలిసి మేడ్చల్‌లో నివాసం ఉంటుండగా కొడుకు శివాన్ను చౌబీ(18) తన సొంత గ్రామంలో ఉండి చదువుకుంటున్నాడు. అయితే ఈనెల 1న మేడ్చల్‌కు తీసుకువచ్చారు. మేడ్చల్‌కు వచ్చిన శివాన్ను ఈనెల 14న సాయంత్రం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు శివాన్ను కోసం మేడ్చల్‌లో వెతికారు. సొంత గ్రామానికి వెళ్లి ఉండవచ్చని వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి..

కాచిగూడ, జూన్ 17: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (35) సోమవారం ఉప్పుగూడ - యాకత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు చేయూత..

పేద విద్యార్థులకు చదువు నిమిత్తం రూ. 30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్

మాదాపూర్, జూన్ 17: లయన్స్ క్లబ్ ద్వారా పేద విద్యార్థులకు చేయూతగా నిలిచి.. వారికి అండగా నిలుస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ అన్నారు. చదువు నిమిత్తం ఆఫీస్ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్న వారి పిల్లలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ రూ. 30 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... అయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ ద్వారా అనేక మందికి చేయూతగా నిలిచినట్లు తెలిపారు. మున్ముందు సేవలను ముమ్మరం చేసే విధంగా అడుగులు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మాదాపూర్‌లోని ఓ కార్యాలయంలో ఆఫీస్ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్న చారి కుటుంబానికి చెందిన పిల్లలు నిఖిత (8వ తరగతి), నవ సాయి (5వ తరగతి) స్థానికంగా విద్యను అభ్యసిస్తున్నారు. వారి చదువుల నిమిత్తం లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ ద్వారా రూ. 30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సోమ నాగరాజు, కృష్ణ, మధుసూదన్‌రెడ్డి , రెడ్డి ప్రవీరెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీవారికి చక్రస్నానం

స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న పూజారులు

హిమాయత్‌నగర్, జూన్ 17: కలియుగ దైవం వెంకటేశ్వరుడి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిసాయి. హిమాయత్‌నగర్‌లోని లిబర్టీ వద్ద గల టీటీడీ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పల్లకి ఉత్సవంతో పాటు మహాపూర్ణా హుతి, చక్రస్నానం, పుష్పయాగం, ధజ్వారోహనం కార్యక్రమాలు జరిగాయి. ఈనెల 12న ప్రారంభమైన బ్రహోత్సవాలు ప్రత్యేక పూజలతో ముగిశాయి. కార్యక్రమంలో టీటీడీ ఉపకార్యనిర్వహణ అధికారి ఎం.రమేశ్‌బాబు పాల్గొన్నారు.

బైండ్ల కుల సంఘాన్ని ప్రత్యేకంగా గుర్తించాలి

శామీర్‌పేట, జూన్ 17: ఎస్సీల్లో మాల, మాదిగ ఉపకులాలతో పాటు బైండ్ల కులాన్ని మూడో కులంగా ప్రత్యేకంగా గుర్తించాలని రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి రాంచందర్ అన్నారు. శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని సంగీత్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బైండ్ల కుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా బైండ్ల రాంచందర్, ఉపాధ్యక్షుడిగా బైండ్ల శంకర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా నర్సింలును రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి రామకృష్ణ, సలహాదారులు బైండ్ల కుమార్, సంజీవరావు, నర్సింహ, శ్రీను, సునీల్, రమేశ్, బల్‌నర్సింహా, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు,సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారుల మొహంలో చిరునవ్వే లక్ష్యంగా..

- వైద్యశాలలో ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ సేవలు..
- రావూస్ ఈఎన్‌టీ వైద్యశాల చైర్మన్ జీవీఎస్ రావు

కేపీహెచ్‌బీ కాలనీ రావూస్ వైద్యశాలలో జరిగిన వేడుకల్లో చిన్నారులకు గిఫ్టులు అందిస్తున్న చైర్మన్ జీవీఎస్ రావు, డైరెక్టర్ శ్రీరావు తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 17 : పుట్టుకతో మూగ, చెవిటి సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల మొహంలో చిరునవ్వును చూడాలని, వారికి బంగారు భవిష్యత్‌ను అందించాలన్న లక్ష్యంతో పేదలకు ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సను అందిస్తున్నామని, ఈ వైద్య సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రావూస్ ఈఎన్‌టీ వైద్యశాల చైర్మన్ జీవీఎస్ రావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలోని రావూస్ ఈఎన్‌టీ వైద్యశాలలో...వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ పూర్తైన చిన్నారులు, తల్లిదండ్రులతో కలసి ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా వైద్యశాల చైర్మన్ జీవీఎస్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ చైతన్యరావు, డైరెక్టర్ శ్రీరావులు పాల్గొని.. చిన్నారులతో కలిసి కేక్‌ను కట్‌చేసి, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు గిఫ్ట్(స్కూల్ బ్యాగ్, కంపాక్స్ బాక్స్, లంచ్‌బాక్స్, పెన్నిళ్లు, పెన్నులతో కూడిన కిట్)లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్నారులకు పుట్టకతో మాటలు రాకపోవడానికి ప్రధానమైన కారణం...చిన్నారుల చెవిలో లోపాలు ఉండటమేనని, సకాలంలో లోపాలను గుర్తించి శస్త్ర చికిత్సను చేయించడం వల్ల బాధిత చిన్నారులు తిరిగి మాములు మనుషుల్లా మాట్లాడుతారన్నారు. ఇప్పటికే 50 మంది చిన్నారులకు శస్త్ర చికిత్స చేయడంతో వారు మాట్లాడటం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. భవిష్యత్‌లో కూడా ఉచిత వైద్యసేవలు కొనసాగుతాయని, సమాజంలోని పేదలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 17 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతు బజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) ఈ కింది విధంగా ఉన్నాయి.

టమాట కిలో రూ.47, వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 80, బజ్జి మిర్చి 75, కాకరకాయ 60, బీరకాయ 72, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 145, క్యారెట్ 45, కాలీ ఫ్లవర్ 28, దొండ 43, చిక్కుడు 65, గోరుచిక్కుడు 55, బీట్‌రూట్ 23, క్యాప్సికం 68, ఆలుగడ్డ 35, కీరా 38, దోసకాయ 23, సొరకాయ 17, పొట్లకాయ (1) 20, కందగడ్డ 45, ఉల్లిపొరక 85, ఉల్లిగడ్డ 39, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 5నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన

తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ, పికాసో దిస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఎండ్ లవ్ పేరుతో సోమవారం రవీంద్రభారతిలోని ప్రాంగణంలో చిత్రకళ ప్రదర్శన విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ , హైదరాబాద్ హార్ట్ సొసైటీ ప్రెసిడెంట్ రమణారెడ్డి విచ్చేసి ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పెయింటింగ్ ఫ్యాకల్టీ మహేశ్, పికాసో సంస్థ అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

– రవీంద్రభారతి